# కన్నీటి ఖరీదు

“సంపేసేరు బాబో నా కొడుకుని సంపేసేరు. నా కొంప నిలువునా కూల్చేసినారు. నన్ను రచ్చించు బాబయ్యా. నన్ను రచ్చించు” అంటూ వచ్చిపడ్డది ప్లీడరు రఘు ఆఫీసులో ఓ ముసల్ది.

తెల్లబోయి చూసేరు గదిలో క్లయింట్లందరూ. చూస్తున్న కేసుఫైలు కిందికిదించి ఎవరా అన్నట్టు చూసేడు ముసల్దానివైపు రఘు.

‘నా కొడుకే నేరం సెయ్యలేదు బాబయ్యా. ఆడేనాడూ ఎవరితోనీ సెయ్యైన సేసుకోడు. అలాంటోణ్ని బేడీలేసి తీసుకుపోయినారు. నా ఆదరవు నిలువునా నరికేసినారు’ అని ఎవరూ ఏం జరిగిందని అడక్కుండానే ఏడుస్తూ చెప్పింది ముసల్ది.

కాళ్ళూ చేతులూ ఎండిపోయి ‘గొల్లభామ’ పురుగులా వుందామె. కార్చిన కన్నీరు చారలుకట్టి జీడిడాగులతో వడలిపోయిన మామిడిపండులావుంది ఆమె మొహం. తాగిన కాసిన్ని గంజినీళ్లు కన్నీరు కిందపోయింది కాబోసు పొట్ట ఎండిపోయి వుంది. ఉన్న కన్నీరు కాస్తా వచ్చేయడాన్ని కళ్ళు ఎర్రగా అయ్యేయ్.

‘అదేటో సెప్పమ్మ సరిగ్గా. ఏటో చెప్పకుండా ఏడిస్తే ఎటా. బాబు నూతారు. నీకే పిక్కా వుండదు. అన్నాడు ఓ ముసలి క్లయింటు.

‘ఏం జరిగిందీ చెప్పకుండా ఏడుపు లంకించుకుంటే ఎలా’ నన్నాడు మరోకాయన.

ఏం చెపుతుందో విందామని కటచూడడం మూసేసి ఆగేడు ప్లీడరు రఘు.

‘దొంగదళ ఆడు సారా దొంగసాటుని తెచ్చి అమ్ముతాడు బాబయ్యా. అణ్ణం పుణ్ణెం మా కుర్రోడెరగడు బాబయ్యా’ అని శోకం కొంత చల్లారినా ఇంకా దీర్ఘం తీస్తూనే చెప్తుంది ముసల్ది.

‘ఏంటీ తలనొప్పి. వరుసావాడి లేకుండా చెపుతావేం. నేనేం కాళ్లు చాపుకుని ఖాళీగా కూర్చున్నాననుకున్నావా’ అని గద్దించేడు రఘు.

‘ఆడే యింత సేసినోడు బాబయ్యా నేకపోతే నా కొడుక్కేం నాడన్నా బేడీలడ్డాయా’ అని దీర్ఘంతీస్తూంటే—

‘అది కాదు అవ్వా. నీ కొడుకు నెందుకు పోలీసోళ్ళు పట్టుకున్నారు? ఆ దొంగసారా అమ్మేవోడెవడు? ఆడు నీ కొడుక్కేమన్నా స్నేహితుడా? ఇయ్యన్నీ వరసగా ఓ కత సెప్పినట్టు సెప్పు. లేకపోతే ప్లీడరుబాబు ప్రశ్నలడుగుతారు జవాబులియ్యి’ అన్నాడు ప్లీడరుగారికి దగర గ్రామంనుండి కేసులు తీసుకొనివచ్చే ఓ కోర్టుపక్షి.

కాని ముసలి తన ధోరణిలోనే, తలాతోకా లేకుండా చెప్పుకుపోతుంటే సైకిలు నేర్చుకునేవాణ్ణి పడిపోకుండా పట్టుకున్నట్టు అతను సాయపడి అసలు కథ తేల్చేడు.

అవ్వకి ఒక్కడే కొడుకు. కూలిపని చేస్తున్నాడు. వాడిమీదే ఆధారపడి తను బ్రతుకుతుంది. కుర్రాడికింకా పెళ్ళికాలేదు. అవ్వ అద్దెకుంటున్న కొంప పక్క కొంపలో వాడు దొంగసారా అమ్ముతాడు. పోలీసులు అనుమానంమీద అటు రావడం చూసి సారా కుండ అవ్వవాళ్ళ వాకిట్లో వదిలేసి పొరుగింటి వాడెటో జారుకున్నాడు. అది చూసి

## కీర్తిప్రియ

‘ఏట్రది? ఏట్రది?’ అని అవ్వ లోపలినుంచి అరిచింది. మధ్యాహ్నం తిండి తిని విశ్రాంతి తీసుకుంటున్న కొడుకు పంచ యివతలికివచ్చి సారాకుండ చూసి ఏం చెయ్యడానికి తోచక తికమక పడుంటే పోలీసులు వచ్చేసేరు. రెండుగంటల వేళ. మరెవరూ పక్కింటివాడు ఆకుండ అక్కడ పెట్టడం చూడలేదు. అవ్వ నెత్తీనోరు బాదుకున్నా పోలీసోళ్ళు వినలేదు, బేడీలు వేసి కొడుకుని సారాకుండతో సహా తీసుకుపోయేరు అదీ కథ.

‘అమ్మయ్య ఇప్పటికి తేల్చేవ్ కథ నీ కొడుక్కేం ఫర్వాలేదు నేను కేసు చేస్తానులే’ అన్నాడు రఘు.

‘నా తండ్రే నాబాబే నా ప్రాణం నిల్పినావు బాబయ్యా అంది ముసల్ది’ ఆనంద బాష్పాలు తుడుచుకుంటూ.

‘సరేగాని డబ్బు ఏమాత్రం తెచ్చేవ్’ అన్నాడతను.

‘ఏ మాత్రం ఉండాల బాబయ్యా’ అని ప్రశ్నించింది.

‘కుండెడు సారా అంటున్నావ్. పక్కింటివాడు మీ యింటిదగ్గర పెట్టేవట్టు సాక్ష్యం ఏం దొరుకుతున్నట్టు లేదు. కేసు జాగ్రత్తగా చెయ్యాలి’ అని ఆగేడతను.

‘మీరు జాగ్రత్తగా చేయకపోతే మరెవరు చేస్తారుగాని కేసుమాత్రం చాలా బలంగా వుంది. అనవసరంగా అమాయకుడు సిక్కడాడు’ అన్నాడు కోర్టుపక్షి.

ఓ యాభైరూపాయలవుతుంది. ఈ వేళ పదిహేను రూపాయలియ్యి తర్వాత వాయిదాకి అయిదు చొప్పున తీస్కో అని పూర్తిచేసేడు రఘు.

‘ఓలమ్మో ఓలమ్మో, అంతిచ్చుకోలేను బాబయ్యా బీదదాన్ని ఆడు తప్ప ఆదరువు లేదు బాబయ్యా. ఓపదిరూపాయలు సేసుకో నా కొడుకెప్పుడు నేరం సెయ్యలేదు. ఓ గుక్కెడు సారానీళ్ళన్నా తాగెరగడు బాబయ్యా’

నీ కొడుకు నేరం చేసిందీ లేంది నువ్వు నేనూ చెప్పే కోర్టువారు నమ్మేస్తారా. సాక్షిబలంమీద విచారణలో తేలాలిగాని. ఏభైయివ్వగలిగితే వుండు లేకపోతే యింకో చోటకి వెళ్ళిపో.

నా తప్పుకాయి బాబయ్య అంతిచ్చుకోలేను. నా కొడుకు నిడిపించి నా ప్రాణం నిలబెట్టు.

రఘు మాట్లాడక ఊరుకున్నాడు.

‘పోనీ ముప్పైఅయిదు చేసుకో ఈయేళ పదిరూపాయలియ్యి తర్వాత వాయిదాకి అయిదుచొప్పున నిచ్చుకో’ అన్నాడు కోర్టుపక్షి బేరం తెగోడూ.

ప్లీడరు కొద్దిగా మూలిగి ‘పోనీ అలాగే నా చెయ్యి. ఏడుసూకూర్చున్నావని ఒప్పుకున్నాను. లేకపోతే శిక్షపడితే ఏమౌతుందో తెలుసా. అయిదువందల రూపాయలవరకూ జరిమానా వేస్తారు లేదా ఆర్నెల్లు ఖైదుకు వెళ్ళమంటారు’ అన్నాడు.

‘అలాగే ముప్పై యిచ్చుకుంటాను బాబయ్యా. కానిప్పుడు రెండు రూపాయలున్నాయి. అయి తీసుకో’ అని బొడ్లో దోపిన చిరిగిన చీరకొంగుతీసి దానో మూడు మడతలు పెట్టివున్న రెండు రూపాయలనోటు పైకి తీసింది.

రఘు కోపంతో ‘ఫో, యిక్కడినుండి ఫో. రెండు రూపాయలకి కేసుపెట్టేవాడెవడైనావుంటే అక్కడికివెళ్ళు నీ కేసు యిచ్చెయ్ మరెక్కడ కనపడకు. పొద్దున్నే ఏడుపు మొహంతో ప్రత్యక్షమయి నా పనంతా పాడుచేసేవ్. లే. లే’ అన్నాడు.

ముసల్ది ఏడుస్తూ బొడ్డులో దోపిన

రూపాయి, పదణాల చిల్లరడబ్బు పైకితీసి అదికూడా యిస్తూ 'అంతా కలిసి యింతే వున్నాయి బాబయ్యా. ఎక్కడా అప్పు పుటనేదు నా మాట నమ్మబాబయ్యా మాట తప్పను బాబయ్యా. అన్నంత డబ్బు యిచ్చేస్తాను. కావాలే యిప్పుడివ్వలేను. నీ పాదాల బడి యేడుకుంటాను. నన్ను రక్షించు బాబయ్యా' అంది.

రఘు కాస చలించినా వెంటనే మనసు గట్టిచేసుకొని కోపంగానే 'నువ్వు నా పాదాలపడి ఏడవనవసరమూ లేదు. నేను రక్షించనవసరమూ లేదు. నీ మాటా, నీ నిజాయితీ నాకనవసరం. డబ్బు పదిరూపాయలిప్పుడు తెచ్చుకోగల్గితే కేసు చేస్తాను. లేకపోతే నేను చెయ్యను. డబ్బు తెచ్చుకోకపోతే వెళ్ళిపో' అన్నాడు.

ముసల్ది మరేం మాట్లాడలేదు. కాని ఏడుస్తూ అక్కడే కూర్చుంది.

రఘు 'పొమ్మంటే నీకు కాదూ, ఇక్కడ కూర్చుని ఎంతసేపు ఏడ్చినా ఏం ప్రయోజనం లేదు' అని అక్కడనుంచి పంపించేసేడు.

ముసల్ది వెళిపోతుంటే 'కాస్తంత రొంపా జబ్బు చేస్తే డాక్టరు కక్కమన్న డబ్బు కక్కుతారుగాని పీడరంటే లోకువ. ఏడిస్తే వట్టినేచేసా రనుకుంటారు కాబోలు' అన్నాడు రఘు.

క్లయింటందరూ వచ్చేరు. పీడరుగారు వచ్చేసున్నారు. వాళ్లతో పాటు కమలకూడా తనలో తను నవ్వుకుంది. అయితే కమల ఆ గదిలో లేదు, ఆఫీసుగదిలో జరుగుతున్న గొడవ పక్కగదిలోంచి వింటుంది.

కమల రఘు భార్య. పెళ్ళయి ఆరేళ్లయింది. ఇద్దరు మగపిల్లలు, రఘు ప్రాక్టీసు ప్రారంభించి అయిదేళ్ళే అయినా తాతల దగ్గరనుండీ ప్లీడరు వృత్తి వాళింట్లో వుండడాన్ని కేసులు బాగానే వస్తున్నాయి. రఘుకూడా డబ్బుదగ్గర ఖచ్చితం. నక్క వినయాలు యిట్టే కనిపెట్టి డబ్బు పెడితే నేగాని కేసు చేయననేవాడు. ఎంత కష్టకాలంలో వున్నానన్నా కేసు పట్టేవాడు కాదు. ఎదుటివాడు ఎంత హృదయం కరిగేటట్టు ఏడ్చినా డబ్బు పుచ్చుకోవడం వృత్తిధర్మం అనేవాడు. అంచేత డబ్బు బాగానే వస్తుండేది.

కాని ఏంలాభం. పోయిన తండ్రి ఓ మేడా, మామిడితోటా, ఐదెకరాల భూమీ మిగిల్చిపోయినా దానికి తగ్గట్టు పెళ్లి కావల్సిన కూతుళ్ని ముగురిని యింకా చదువుతున్న కొడుకు లిద్దరినీ, భార్యనీ పెద్ద కొడుకు లిద్దరికీ వప్పజెప్పి పోయేడు. ఆయింటో సంపాదిస్తున్నదలా రఘూ, వాళ్ళన్నయ్యాను. కాని వాళ్ళ అన్నయ్య సంపాదనకి తగ్గట్టు అతనికి ఇద్దరు ఆడపిల్లలూ, ఒక మొగపిల్లడూను. రఘుకి యిద్దరు మొగపిల్లలు. ఇంత సంసారాన్ని గట్టెక్కించుకురావడం కష్టసాధ్యముగుతుంది.

అయితే భేదభావమేమీ లేకుండా ఆ కుటుంబం గడుపుకుని వస్తుంది. కాని యిప్పుడిప్పుడు కమలకి సంతానం కలిగేక ఆమెలో మార్పు రాజోచ్చింది. ఆ కుటుంబంలో నలుగురి పిల్లలతోపాటు తన పిల్లలూ అన్నట్టూ కాకుండా తన పిల్లలకో ప్రత్యేకతవుందనీ, వాళ్ళు పెరగవలసినతీరు వేరని అనిపించింది ఆమెకు. భర్త నాలుగురాళ్ళు తెస్తున్నప్పుడే జాగ్రత్తపడకపోతే తనపిల్లలు పెద్దచదువులు చదివి పెద్దవాళ్లవని భయంకలగడం మొదలు పెట్టింది.

ఆ రాత్రి రఘు కొత్తగా వచ్చిన ఖూనీ కేసు ఫైలు చదువుకుని పడుకుందామని గదిలోకి వచ్చేటప్పటికి కమల కలకలలాడుతూ కన్పించలేదు. పరుపుమీద ఓపక్కకి వత్తిగిల్లి పడుకునివుంది. పెద్దపిల్లడు చిన్నమంచం మీదా, చంటివాడు గది మధ్య వున్న ఉయ్యాలలోనూ నిద్రపోతున్నారు.

రఘుదగ్గరకి వెళ్ళేటప్పటికి సన్నగా ఏడుపు వినిపిస్తూంది. కమలని పిలిచేడు. పలకలేదు చేతితో కదిపేడు. కదలలేదు. 'ఏం అలావున్నావ్' అన్నాడు మాట్లాడలేదు.

సరేనని కిటికీదగ్గరున్న కుర్చీలో కూర్చుని కేసుఫైలు కిటికీలో పెట్టి కాగితాలు ఒక్కొక్కటీ చదవడం మొదలుపెట్టేడు రఘు. ఓ అయిదునిమిషాలు చదివేటప్పటికి కమల మంచంమీదనుంచి లేచి పిచ్చిదానిలా అతని చేతిలో కాగితాలులాగి గదిమధ్యకు విసరేసి మంచంమీద కూర్చుని కన్నీరుకార్చడం మొదలు పెట్టింది.

రఘుకి ఆశ్చర్యం వేసింది. వెంటనే కోపం కూడా వచ్చింది. కాని ఆవిడ ఏడుస్తుండడం చూసి ఏంచెయ్యలేకపోయేడు. చిరునవ్వొకటి ఎరువు తెచ్చుకుని.

'ఏం వెర్రెత్తిందా?' అన్నాడు.

'మీలాంటివాళ్ళని కట్టుకుంటే వెర్రెత్తదా?' అంది కోపాన్నీ దుఃఖాన్నీ మిళితంచేస్తూ.

'ఏం. ఏం కలిగింది లోటు'


'అవును లోటేంవుంది. భోజనం నిద్రా వుంటే అన్నీ వున్నట్టే. పిల్లలూ వాళ్ళ బాగోగులూ అవీ అక్కరేదు' అంది మంచంమీద నుంచి లేస్తూ.

'పిల్లలకిమాత్రం ఏం లోటని, పెద్దవాడికి పట్టుమని మూడేళ్ళులేవు. ఇప్పుడు వాడి చదువుసాగడం లేదనా, ఏంలోటని.'

'అవునండి ఎవరి పిల్లల్ని చూసి నా ముచ్చటేస్తారు. మనవాళ్లు పేరుకి పీడరుగారి అబ్బాయిలూ, తిన్నగా కట్టుకోడానికి బట్టవుండదు. సరియైన తిండవుండదు. ఊరందరూ వెన్నలూ నేతులతో తింటుంటే మనవాళ్ళు సరైన తిండి అయినా తినడానికి నోచుకోలేదు.'

'ఒక్క అయిదారేళ్ళు ఓపికపట్టు కమలా, తమ్ముళ్లిద్దరి చదువులు అయి చెల్లెళ్ల పెళ్లిళ్లయిపోతే దర్జాగా బ్రతకవచ్చు.

'ఓ చాలా దర్జాగా బ్రతకొచ్చు. వాళ్ల పెళ్ళిళ్ళయి చదువులయేటప్పటికి మనకి ముసలికాలం వస్తుంది. పిల్లా జల్లా మీకు మీ అన్నగారికి మరి నలుగురు కలుగుతారు. చదువుకున్న తమ్ముళ్ళు కాస్త 'జై హనుమహారా' అని చేతులెత్తి యింటికి దమ్మిడీ యివ్వ



జ్యూరర్లు: "సైకిల్ దొంగిలించిన ఆ ముద్దాయి దోషికాడని మా ఏకగ్రీవాభిప్రాయం."

# ★ కన్నీటి ఖరీదు ★

కుండా మకాం ఎత్తేస్తారు. ఉన్న భూమి కాస్తా పెళ్ళిళ్ళకింద హారించుకు పోతుంది అప్పుడు మనకింక మిగిలేది ముష్టిచిప్పే' అనే టప్పటికి కమల కళ్ళు నీళ్ళతో నిండి వున్నాయి. వస్తున్న విచారాన్ని అణిచి పెట్టుకుంటూ తెరలు తెరలుగా ఏడవడం మొదలు పెట్టింది.

పాపం ఎంతబాధ తనలో యిముడ్చుకుందో, కలకలలాడే ఆమె మొహంలో తారలు కట్టిన కన్నీటి ఛాయలు తనెప్పుడు చూడ్డలేదు. తన కమలకూడా కన్నీరు కారుస్తుందని ఊహించలేదు. ఆ విచారం అతణ్ని కదిలించి వేసింది. ఆ కదలికలో అతణ్ని అంటి వున్న సమిష్టికుటుంబం, దాని సభ్యుల బాధ్యత మొదలైన నమ్మకాలు సడలిపోయాయి.

అయినా, 'ఇంతకీ ఏమిటి చెయ్యమంటావ్' అన్నాడు ఏమీ తెలియని వాడిలా.

'మీకు తెలియదూ. నేనే చెప్పాలా.' అంది వస్తున్న విచారాన్ని అపుకోడానికి ప్రయత్నిస్తూ.

'కాదు చెప్పవూ' అన్నాడు ఆప్యాయంగా.

'వేరే కాపురం పెడదాం. లీడర్ అంటే నెలజీతంలా నమ్మకమైందేం కాదు. ఒంట్లో ఓపికవున్న నాలురోజులు తెచ్చుకున్నది అందుకూ యిందుకూ తగలేస్తే తర్వాత మనం చెయ్యగల్గిందేమీ లేదు' అని ఆగలేదు కమల. తర్వాత ఏమనాలో ఆమెకి తెలుసు. 'పోనీ మరుదులు చదువులయేక నలుగురితోపాటే తెస్తున్న నాలుగురాళ్లు యింట్లో పడేస్తారంటే ఆ నమ్మకంలేదు; యీ రోజుల్లో చదువులయేవరకు యింట వుండడం ఆ తర్వాత పెళ్లాలతో దక్కపోవడం. ఉన్నారే అనుకున్నా వాళ్ల ఆర్జన ఏ మాత్రమో ఏం చెప్పగలం. వాళ్లు పదిరూపాయలు తెస్తూ ఎనభుందుగురు పిల్లల్నికంటే ఏం చేయగలం'అని పూర్తి చేసింది.

'కమల తను ఊహించనివికూడా ఎన్నో ఊహించింది. తనకంటే ఎన్నోరెట్లు దూరపుఆలోచన కలది. ఇన్నాళ్లు తనకా విషయాలే తట్టలేదు' అనుకున్నాడు.

'సరే చూద్దాం. ఇకమీదట ఆ ధ్యాస మీదే వుంటాను. కాని యిప్పుడే పైకి పోవడానికి మనదేం అంత పెద్దఆర్జన కాదే'.

'అట్టే నాకు తెలియదనుకోకండి. ఏ ఆర్జన లేదనేంటి, ఉదయం ఆ ముసలమ్మ నెత్తీ నోరూ బాదుకున్నా డబ్బు బల్లమీద పెడితేకాని కేసు చెయ్యనని పట్టు పట్టారు.'

'నీ కెలా తెలుసు.'

'అంతా వింటూనే వున్నాను.'

'సరేతే ఆలోచిద్దాం.'

ఆలోచిద్దాం 'ఆలోచిద్దాం. ఆగుణం పోయింది కాదు,' అని ఏడుస్తూ 'వారం రోజులలో వేరే కాపురం పెడ్తే పెట్టేరు లేక పోతే నేను మా యింటికి పోతాను' అంది.

ఊరుకో మన్నా ఆగకుండా ఏడవడం మొదలు పెట్టింది. ఆమె విచారం చూడలేక పోయేడు రఘు. ఇక యిలా రోజూ తన కన్నీటితో శరీరం పాడుచేసుకుంటుందేమో అని భయం వేసింది.

'సరే రేపు అమ్మకీ అన్నయ్యకీ వాళ్ళకీ చెప్పేసి రేపటినుండి యిల్లు వెతుకుతాను. సరా' అన్నాడాయన.

'ఒట్టు' అని చెయ్యి చాపింది కమల.

'ఒట్టు' అన్నాడు రఘు.

సంతోషంగా 'అబ్బ ఎంత మంచి వారండి మీరు' అంటూ పరుపుమీద పడుకుంది కమల. అలానే నిద్రపోయింది భవిష్యత్తుకూర్చి కలలు కంటూ.

కేసు ఫైలు చదువుకుంటున్న రఘు కాగితాలు కట్టేసి నిద్రపోతున్న ఆమె వైపు చూసి 'పత్తిది పిల్లల భవిష్యత్తు కోసం ఎంత బాధపడుతోంది' అనుకున్నాడు. ★


ఇది మీకు ప్రసిద్ధి బొందే అవకాశము

"మీరు కూడ సినిమా తార కావచ్చును"

కాంపిటీషన్ పోటీలో పాల్గొనండి

ఇంకా వివరములకోసం

మీ "'హాజ్ లైన్' స్నో" వ్యాపారిని నేడే కలుసుకొండి

లేదా దిగువ చిరునామాకు వ్రాయండి

"యూ టూ కెన్ బి ఎ స్టార్" కాంపిటీషన్

పోస్టు బాక్సు నం. 6532, బొంబాయి 26

కాంపిటీషన్ ముగింపు తేది 15-11-58



...వారిచే నియమింపబడినది